ప్రజాశక్తి

శనివారం 27 జులై 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కుసులవాడలో..

ప్రైవేటుకు ఖనిజ తవ్వకాలు

◆ 7.991 హెక్టార్లలో పనులకు అనుమతి ◆ ఆగస్టు 28న ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ గ్రామంలో ఖనిజ లోహం క్వార్ట్జైట్ మైనింగ్‌కు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఈ ఫైలుపై చకచకా కదులుతోంది. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అటవీ సంరక్షణ మంత్రిత్వ శాఖ గతంలో జారీచేసిన నోటిఫికేషన్ ఎస్ఒ 1533 ప్రకారం ఓ ప్రైవేట్ సంస్థకు అనుమతులు లభించాయి. ఈ మేరకు కుసులవాడ గ్రామంలో క్వార్ట్జైట్ మైనింగ్‌కు విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే జిల్లా పరిశ్రమల కేంద్రం, గనుల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, భీమిలి ఆర్‌డిఒ, మైన్స్ అండ్ జియాలజీ, ఆనందపురం రెవెన్యూ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కుసులవాడ గ్రామం సర్వే నెంబరు 104లో రఫ్ స్టోన్ గ్రావెల్ క్వారీని విఆర్ ఇన్‌ఫ్రా అండ్ టెక్నాలజీస్‌కు ప్రభుత్వం మంజూరు చేసింది. సుమారు 7.991 హెక్టార్లలో మైనింగ్‌కు అవకాశం ఇచ్చింది. అక్కడి నుంచి క్వార్ట్జైట్



క్వార్ట్జైట్ లోహపు రాయి (ఫైల్‌ఫొటో)

తీసుకోవచ్చు.

పబ్లిక్ హియరింగ్‌కు సన్నాహాలు

కుసులవాడ గ్రామ పమీపంలో 2024 ఆగస్టు 28న ఉదయం 11 గంటలకు పబ్లిక్ హియరింగ్ నిర్వహించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. క్వార్ట్జైట్ ఖనిజ లోహం లేదా శిలను మైనింగ్ చేసుకోడానికి అనువుగా ప్రజల్లో ప్రచారం చేసే దిశగా ఎపి పిసిబి అధికారులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సమాయత్త మవుతున్నారు. సాధారణంగా గనుల తవ్వకాలకు ఎక్కడా స్థానిక ప్రజానీకం అనుమతించడం అనేది జరగదు. గ్రామ పంచాయతీ తీర్మానం కూడా ఉండాల్సిందే. అలాంటిది నేరుగా ఒక ప్రైవేట్ మైనింగ్ సంస్థకు కేంద్రంలోని బిజెపి సర్కారు నేరుగా తవ్వకాలకు అనుమతులను ఇచ్చేసింది.

ఎంత తవ్వుకోవచ్చు ?

పైన తెలిపిన 7.991 హెక్టార్లలో ఏటా 34,962 ఎం3 క్వార్ట్జైట్, 1,11,018 ఎం3 రఫ్ స్టోన్ గ్రావెల్ కుసులవాడలో మైనింగ్ చేసుకోవచ్చు. ఇఐఎ నివేదికను సైతం జిల్లా అధికారులకు సదరు సంస్థ అందజేసింది. రెవెన్యూ ఉన్నతాధికారులు ఈ మేరకు పర్యావరణ ప్రభావ నివేదికను ప్రజాభిప్రాయ సేకరణ కోసం ముందుగానే ఆనందపురం తహశీల్దార్ కార్యాలయంలో ఉంచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషుల్లో ఆ కాపీలను నోటీసు బోర్డుల్లో ఉంచనున్నారు. ఈ మేరకు ఈ నెల 24న విశాఖపట్నం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జోనల్ ఆఫీసర్ పైడి వెంకట ముకుందరావు ఇఐఎ డ్రాఫ్ట్ నివేదికను సిద్ధం చేశారు. ఆగస్టు 28న కుసులవాడ గ్రామంలో స్థానికంగా క్వార్ట్జైట్ మిగతా 2లో..



పోర్టు కార్మికుల దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ బి.గంగారావు

షరతులు లేని వేతన ఒప్పందం చేయాలి

◆ పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలి

◆ సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలని, పోర్టులో షరతులు లేని వేతన ఒప్పందం చేయాలని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. విశాఖపట్నం పోర్టు సి-హార్స్ జంక్షన్ వద్ద పోర్టు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజైన శుక్రవారమూ కొనసాగాయి. శిబిరాన్ని సందర్శించిన ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టులుగా మార్చడానికి, మరింత దేశ, విదేశీ ప్రైవేట్ కంపెనీలను ఆకర్షించడానికి షిప్పింగ్ మినిస్ట్రీ మోడల్ కన్సెషన్ అగ్రిమెంట్ (ఎంసిఎ)లో చాలా మార్పులు చేసిందన్నారు. 2030 నాటికి 80 శాతం మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టులుగా మార్చే లక్ష్యాన్ని పెట్టుకున్నారన్నారు. కేంద్ర మంత్రి ప్రకటించినట్లు మేజర్ పోర్టుల్లో అధునాతన పోర్టు అయిన జెఎన్‌పిటిని వంద శాతం ల్యాండ్‌లార్డ్ పోర్టుగా మార్చేసారన్నారు. దీని కారణంగా జెఎన్‌పిటిలోనున్న అన్ని బెర్తులు, అన్ని విభాగాలు మిగతా 2లో..

కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై ధర్నా

▶ వార్త 4లో..

వేములవలస హౌసింగ్ కాలనీపై విచారణ

▶ వార్త 3లో..

వాల్తేరు డివిజన్‌లో రైళ్ల రీషెడ్యూల్

▶ వార్త 2లో..



బీచ్‌రోడ్డులో కార్గిల్ యుద్ధవీరులకు నివాళ్లర్పిస్తున్న నావికులు

పలుచోట్ల కార్గిల్ విజయ్‌దివస్

యుద్ధ వీరులకు ఘన నివాళి

వార్త 7లో..

నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

◆ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి జరుగుతుండటంతో ప్రాధాన్యత

◆ హాజరుకానున్న కొత్త ఎంపీలు, ఎమ్మెల్యేలు

◆ ప్రజా సమస్యలపై చర్చ జరగాలని పలువురి ఆకాంక్ష

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

శనివారం జరిగే ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రత్యేకతను సంతరించుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారి జరుగుతున్న సమావేశమిది. గత సమావేశం నాటికి ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలెవరూ ఇప్పుడు లేరు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటుకానున్న జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాలలో పాత ఎమ్మెల్యేలు, ఎంపీలలో ఒకరూ లేరు. హుకుంపేట జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం ఈసారి అరకు ఎమ్మెల్యేగా తొలిసారి జిల్లా పరిషత్ సమావేశంలో అడుగుపెట్టనున్నారు. పాయకరావుపేట, యలమంచిలి, నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, మాడుగుల, పెందుర్తి, భీమిలి, అరకు, పాడేరు ఎమ్మెల్యేల్లో యలమంచిలి, పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు సమావేశానికి తొలిసారి ఎన్నికై వస్తున్నారు. అరకు, అనకాపల్లి, విశాఖపట్నం ఎంపీలు డాక్టర్ తనూజారాణి, సిఎం.రమేష్, ఎం.శ్రీభరత్ కొత్తగా ఎన్నికయ్యారు.

ఎంతో అనుభవం, అవగాహన కలిగిన వారితో పాటు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు అడుగుపెట్టనున్న ఈ సమావేశానికి ప్రాధాన్యత వుంది. ఉమ్మడి జిల్లా సమస్యలపై పార్టీలకు అతీతంగా వాటి పరిష్కార నిమిత్తం ఏకోన్ముఖ అవగాహనకు రావాల్సివుంది. రాజకీయ బలాబలాలు ప్రదర్శించుకోకుండా, విమర్శలకు తావీయకుండా, ఆరోపణలకు దిగకుండా ప్రజాంశాలపై చర్చించి పరిష్కరించే మార్గాలు అన్వేషించాలి. ప్రజలకు మేలుచేసే వేదికగా జిల్లా పరిషత్‌ను తీర్చిదిద్దగలగాలి. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రాష్ట్రానికి, అందులోనూ జిల్లాకు జరిగిన అన్యాయంపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు నోరువిప్పాలి. తమ జిల్లా భవిష్యత్, అభివృద్ధికి ఒకరికొకరు కలిసి పనిచేయాలి. పరస్పర సహకార మందించుకోవాలి. ప్రజా సమస్యలపై మూకుమ్మడిగా కలిసినడవాలి. కేంద్ర బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కుతీసుకుంటున్నట్టు ప్రకటించలేదు. సరైన రీతిన నిధుల కేటాయింపూ లేదు. ఉక్కు పరిశ్రమకు ప్రమాదం పొంచివుందని సభ్యులు గ్రహించాలి. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సొంత గనులు కేటాయించాలని జిల్లా పరిషత్‌లో తీర్మానం చేసి ఉత్తరాంధ్ర మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రైవేటుకు ఖనిజ తవ్వకాలు

మైనింగ్‌కు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఆయన 'ప్రజాశక్తి'కి శుక్రవారం తెలిపారు. త్వరలో దీనికి సంబంధించిన నోటిఫికేషన్ రానుందన్నారు. ప్రజలు వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.

షరతులు లేని వేతన ఒప్పందం చేయాలి

పిపిపిలో ప్రైవేటు ఆపరేటర్లకు దక్కాయన్నారు. పోర్టు సెక్టార్‌ను పూర్తిగా ప్రైవేటు పెట్టుబడిదారులకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని విమర్శించారు. కొత్త ప్రభుత్వం కూడా బిడబ్ల్యుఎన్‌సి చర్చలకు పిలువలేదన్నారు. వేతన ఒప్పందం కాలం ముగిసి ఇప్పటికి 30 నెలలు పూర్తయిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఐపిఎ దుర్మార్గమైన షరతులను విధించి కాలయాపన చేస్తోందని విమర్శించారు.

బోనస్‌పై ఫెడరేషన్లు, ఐపిఎ 65, 45 నిష్పత్తి ప్రకారం 2020-21 సంవత్సరానికి ఒక అంగీకారానికి వచ్చాయని, 2025-26 వరకు పిఎల్‌ఆర్‌ని పరిష్కరించడానికి ఒప్పందం జరిగిందని తెలిపారు. కేంద్ర మంత్రివర్గం ఆమోదం లేకపోవడంతో బోనస్ అడ్వాన్సులు మాత్రమే ఇచ్చారన్నారు. ఇది గత ఎన్నడూ లేని ప్రక్రియ అని తెలిపారు. పోర్టు పూల్ కళాశీలు, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, హాఫ్ బేసిక్ కార్మికులు, క్యాంటీన్ కార్మికులు, నాన్ పర్మినెంట్ కార్మికులు, షోర్ కార్మికులు, స్టీవ్ డోర్ కార్మికులు ఇలా రకరకాల పేర్లతో విశాఖ పోర్టులో బండెడు చాకిరీ చేస్తున్నారన్నారు. ఎదుగూ బొదుగూ లేని జీతాలతో అర్ధాకలితో జీవితాలను నెట్టుకొస్తున్నారని తెలిపారు. వారికి చట్టపరమైన హక్కులేవీ వర్తించడం లేదన్నారు. కోర్టుల తీర్పులను యాజమాన్యం బేఖాతరు చేస్తోందని విమర్శించారు. వివిధ కారణాలురీత్యా పోర్టులో పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గుతోందన్నారు. పోర్టుల్లో టెక్నికల్, ఆపరేషనల్, మినిస్టీరియల్ అన్ని ఎంట్రీ లెవెల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు.

దీక్షలకు పలువురు మద్దతు

పోర్టు కార్మికుల దీక్షలకు పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డివిఆర్‌ఎస్.మూర్తి, మహేష్, బిహెచ్‌పివి యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రకాష్, గిరిజన సంఘం నాయకులు కోటేశ్వరరావు, విద్యుత్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యారావు, షిప్‌యార్డ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, హెచ్‌పిసిఎల్ యూనియన్ నాయకులు నాగచైతన్య మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పోర్టు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబమూర్తి, సత్యనారాయణ, విడిఎల్‌బి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కన సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, నాయకులు రామలింగేశ్వరరావు, త్రినాధరావు, ఈశ్వరరావు, గణేష్, కనకరాజు, రాము, ఆనంద్, శివ పాల్గొన్నారు.

నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ఆకాంక్షలు, కార్మిక సంఘాల పోరాటానికి బలాన్నివ్వాలి.

సాగునీటి సౌకర్యంలేక కరువుకాటకాలకు ఏటా నష్టపోతున్న రైతుకు శాశ్వత ఉపశమనం కలిగించే పోలవరం ఎడమ కాలువ పనులు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు ఎప్పటిలోగా పూర్తిచేయించగలుగుతామో జిల్లా పరిషత్ సమావేశం ద్వారా సందేశమందించాలి. కొత్త ప్రభుత్వంలో ఏర్పాటైన ఈ తొలి సమావేశంలో సాధారణ అజెండా అంశాలకు పరిమితం కాకుండా క్రియాశీలకంగా పనిచేస్తామన్న స్ఫూర్తిని, ప్రజా ఆకాంక్షలను గౌరవించి నడుచుకుంటామన్న విశ్వాసాన్ని అందరిలో కలిగించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు పేదలకు అందుతాయని, పేద పిల్లలు చదువుకొనే పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించగలుగుతామని మనస్ఫూర్తిగా చెప్పగలగాలి. మూతపడ్డ తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపై చెరుకు రైతుకు మేలుచేసే సముచిత నిర్ణయం తీసుకొనేందుకు ఇదొక వేదిక కావాలి.

ఫార్మా కాలుష్య నియంత్రణకు చిత్తశుద్ధితో కూడిన చర్యలు తీసుకొనేలా, తాడి తరలింపునకు పరిష్కారం దొరికేలా, కాలుష్య రహిత పరిశ్రమల రాకను ప్రోత్సహించి, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు నిధులు రాబట్టేలా, పరిశ్రమల్లో విద్యార్హతలు, నైపుణ్యాల ఆధారంగా నిర్వాసితులు, స్థానికులకు ఉపాధి కల్పించేలా, పరిశ్రమల్లో రక్షణ, భద్రత ప్రమాణాలు అమలుజరిగేలా జిల్లా పరిషత్ సమావేశంలో భాగస్వాములైన ప్రజాప్రతినిధులందరూ తమ బాధ్యతను గుర్తెరిగి వ్యవహరించాలి. అప్పుడే జిల్లా పరిషత్ వేదికకు గౌరవం దక్కుతుంది.

శివాజీపాలెంలో కాలువ మూసివేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శివాజీపాలెం ఆరు కుళాయిలు జంక్షన్‌కు సమీపంలో ఉన్న కారుషెడ్ వీధిలో మురుగునీరు ప్రవహించే కాలువకు జివిఎంసి సిబ్బంది అడ్డంగా చెక్క బల్ల వేసి రాళ్లు పెట్టిన వైనం పట్ల స్థానికులు గుర్రుగా ఉన్నారు. వీధి కాలువలో ఎంగిలి నీళ్లు వేస్తున్నారనే కారణంతో ఇలా చేసినట్లు పలువురు చెబుతున్నారు. కాలువ మూసి వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. తక్షణం ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



కాలువకు అడ్డంగా పెట్టిన చెక్క

వాల్తేరు డివిజన్‌లో రైళ్ల రీషెడ్యూల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్‌లో పుండి - నౌపడ విభాగంలో భద్రత, ఆధునికీకరణ పనుల కారణంగా జూలై 29, ఆగస్టు 1, 3 తేదీలలో పలు రైళ్లను రీషెడ్యూల్, షార్ట్ టర్మినేట్ చేశారు. ఈ నేపథ్యంలో రైలు నెంబర్ 12830 భువనేశ్వర్ - ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 1న సాధారణ షెడ్యూల్ సమయం 12:10 గంటలకు బదులు గంట ఆలస్యంగా 13.10 గంటలకు రానుంది. 22974 పూరీ - గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 3వ తేదీన సాధారణ షెడ్యూల్ సమయం 11:15 గంటలకు బదులు గంటా 30 నిమిషాలు ఆలస్యంగా 12:45 గంటలకు రీషెడ్యూల్ చేయబడింది. 22879 భువనేశ్వర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ 3వ తేదీన సాధారణ షెడ్యూల్ సమయం 12:10 గంటలకు బదులు గంట ఆలస్యంగా 13.10 గంటలకు రీషెడ్యూల్ అయింది. అదేవిధంగా 07470 విశాఖపట్నం - పలాస మెము జూలై 29, ఆగస్టు 1, 3 తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో షార్ట్ టర్మినేట్ చేయబడింది. కావున 07471 పలాస - విశాఖపట్నం మెము రైలు ఆయా తేదీల్లో పలాసకు బదులుగా శ్రీకాకుళం రోడ్డు నుండి బయలుదేరుతుంది. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

6 నుంచి ఢిల్లీలో ఇపిఎస్ పెన్షనర్ల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇపిఎస్ 95 పెన్షనర్ల డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆగస్టు 6, 7, 8 తేదీలలో నిరసన చేపట్టనున్నట్టు ఆల్ ఇండియా పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్, జిల్లా కార్యదర్శి షేక్ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇపిఎస్ 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9000 డిఎతో కలిపి చెల్లించాలని, హయ్యర్ పెన్షన్ కోసం హయ్యర్ ఆప్షన్ అందరికీ అనుమతించాలని, ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎపి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. శుక్రవారం సింకా గ్రౌండ్‌లో నిర్వహించిన ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అర్బన్ యూనిట్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం జర్నలిస్టులకు టిడ్కో ఇళ్లు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరించిందని, ఆ ప్రక్రియ వేర్వేరు కారణాలతో ముందుకు సాగలేదని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోకుండా ఆఖరి నిమిషంలో ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్లు ఇళ్ల స్థలం కేటాయిస్తామని చెప్పి దరఖాస్తులు స్వీకరించిన తరువాత పట్టించుకోలేదని అన్నారు. ఏళ్ల తరబడి జర్నలిస్టుల ఇంటి కల నెరవేరకపోవడం విచారకరమన్నారు. అక్రిడిటేషన్, అటాక్స్ కమిటీలను పునరుద్ధరించడంతో పాటు అన్ని సంఘాలకు ఆయా కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించాలని తాము కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ్, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు ఎ.సాంబశివరావు, రవికుమార్, పితాని ప్రసాద్, రామకృష్ణ, శివప్రసాద్, ఎంఎస్‌ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గమిదే..

సమావేశం అనంతరం ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ అర్బన్ యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఇరోతి ఈశ్వరరావు, ఉప ప్రధాన కార్యదర్శిగా పి.నర్సింగరావు, కార్యదర్శిగా కె.మధన్, ఉపాధ్యక్షులుగా అనురాధ, నాయుడు, కె.బాబూరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పి.భాస్కర్, మళ్ల దేవప్రసాద్, నాయుడు, కోశాధికారిగా సిహెచ్.రాజశేఖర్ ఎన్నికయ్యారు.

ఉద్యోగుల్లో చీలిక తెచ్చే ఉత్తర్వులను రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 9న జారీ చేసిన ఉత్తర్వులు ఉద్యోగుల్లో చీలిక తీసుకుని రావడమే కాకుండా, విద్వేషాలు రెచ్చగొట్టడం, జాతీయ సమైక్యతను దెబ్బతీయడం భారత నాస్తిక సమాజం నాయకులు రాష్ట్ర జె.రవి, టి.శ్రీరామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. 1964 నాటి సర్వీసు రూల్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీ సభ్యత్వాన్నీ కలిగి ఉండకూడదన్నారు. అంతేకాక, రాజకీయ కార్యకలాపాలకు ఉపయోగపడే ఎటువంటి ఆందోళనల్లోనూ పాల్గొనకూడదని గుర్తుచేశారు. మహాత్మాగాంధీ హత్య అనంతరం మతప్రాతిపదికన సమాజంలో విభజనవాదాన్ని వ్యాప్తి చేసే ఆర్‌ఎస్‌ఎస్‌కు అడ్డుకట్ట వేయడానికి నిషేధం విధిస్తూ 1966లో 3/10 (ఎస్) మెమోను అప్పటి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 1970, 1980ల్లో ఈ ఆదేశాలకు సంబంధించి మరిన్ని వివరణలను కేంద్రం విడుదల చేసిందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉద్యోగులు చేరడంపై ఉన్న నిషేధం ఎత్తివేయడం వల్ల ఉద్యోగుల్లో చీలిక వస్తుందని, దాని ప్రభావం ఉత్పాదకతపై పడి దేశ అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను అంగీకరించని వారికి న్యాయం జరగదని, కనుక 9 జూలైన నిషేధం ఎత్తివేస్తూ విడుదల చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని వారు కోరారు.

పిల్లల భవిష్యత్తు ఆర్థిక ప్రణాళికలపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పిల్లల భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు అవసరమయ్యే ప్రణాళికలను తల్లిదండ్రులకు వివరించేందుకు ప్రముఖ జీవిత బీమా సంస్థల్లో ఒకటైన హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, స్ట్రాటజీ గ్రూప్ హెడ్ విశాల్ సుబర్వాల్ తెలిపారు. శుక్రవారం ఉదయం సిరిపురంలోని తమ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ తన బ్రాండ్ ఉనికిని విస్తరించడానికి దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణలకు చేరువ కావడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు.

ద్వితీయ, తృతీయ శ్రేణి మార్కెట్లలో వృద్ధిని కొనసాగిస్తూ, కొత్త శాఖలతో అన్ని ప్రాంతాలకు తమ సేవలు విస్తరిస్తున్నామన్నారు. ప్రాంతీయ కమ్యూనికేషన్ ద్వారా వినియోగదారులతో బలమైన సంబంధాలను ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. లియో బర్నెట్ సౌత్ ఏషియా చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ విక్రమ్ పాండే ప్రచార కార్యక్రమ వివరాలు వెల్లడించారు.

వేములవలస హౌసింగ్ కాలనీపై విచారణ


విచారణ చేపట్టిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అఖిల

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలస హౌసింగ్ కాలనీలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు మేరకు శుక్రవారం 16వ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల ఆధ్వర్యాన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విచారణ చేపట్టారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. కొంతమంది అనర్హులు రెండు ఇళ్లు కలిపి కట్టడం, కొంతమంది ఇష్టానుసారంగా కట్టడాలు జరిపారని కాలనీకి చెందిన పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దళితులకు గత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటి పట్టాలు అందజేసినప్పటికీ, మరలా వారు పట్టాలు తీసుకున్నారని సర్వే బృందం సభ్యులకు వివరించారు. ఫేజ్-1లో దళితులకు ఇళ్ల కేటాయించక పోవడాన్ని కూడా బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో ఇష్టానుసారంగా వ్యవహరించారని కొంతమంది ఆరోపించారు. పూర్తి వివరాలను సేకరించి నివేదికను విశాఖ జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అఖిల తెలిపారు. ఈ విచారణలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డిటి.పద్మావతి, హైమ, వీరభద్రరావు, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, సర్వే సిబ్బంది విజయ్ కుమార్, శ్రీనివాస్, రమణ, గజపతినాయుడు, కొరువయ్య, వీఆర్‌ఒ స్వామి పాల్గొన్నారు.

అనియత విద్యా బోధకులు దస్త్రాలు సమర్పించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : విశాఖపట్నం జిల్లాలో గతంలో పనిచేసిన అనియత విద్యా బోధకులు పది, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లతో పాటు అనియత విద్యా సర్టిఫికెట్లను, సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించిన జాయినింగ్ ఆర్డర్, వాటి నకళ్లను సంబంధిత ఎంఇఒ కార్యాలయంలో సమర్పించాలని అనియత విద్యా బోధకుల సంఘం అధ్యక్షులు మహంతి రమణ, ఉపాధ్యక్షులు చందక శంకర్రావు కోరారు. ప్రభుత్వం కల్పించబోయే ఉద్యోగ అవకాశాలు పొందుటకు ఆయా జిల్లాల వారీగా సిబ్బంది వివరాలను రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌కు సమర్పించాలని చెప్పారు. కొంతమంది మూడు నెలల క్రితమే సంబంధిత ఎంఇఒ ద్వారా బయోడేటా అందించారని, మిగిలిన వారు వీలైనంత తొందరగా సమర్పించాలని కోరారు.

రైతులకు ఇళ్లు ఇచ్చే వరకూ పోరాటం

ప్రజాశక్తి - పిఎం.పాలెం : బక్కన్నపాలెంలో సినీ పరిశ్రమ నిర్మించిన హుదూద్ ఇళ్ల వద్ద రైతులు చేపట్టిన నిరసన 8వ రోజూ కొనసాగింది. కెవిపిఎస్ నాయకులు సియాద్రి పైడితల్లి, రైతు సంఘం నాయకులు బి.పోతురాజు శుక్రవారం దీక్షా శిబిరాన్ని సందర్శించారు. పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇన్ని రోజులుగా వర్షంలో తడుస్తూ ఇక్కడ నిరసన తెలుపుతున్నా ఎపి హౌసింగ్ కార్పొరేషన్ అధికారులకు చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయిన రైతులకు ఎటువంటి నష్టపరిహారమూ చెల్లించలేదని తెలిపారు. హౌసింగ్ అధికారులు వచ్చి ఇళ్లు ఇచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో కె.నాగరాజు, ఎస్.దేవుడు, భవానీశంకర్, అక్కమ్మ, కె.గౌరమ్మ, గణేష్, యు.అరుణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డి.ప్రవీణ సంకలనం చేసిన "తెలుగు సాహిత్యం, సామాజికత" పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి శుక్రవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. .

జివిఎంసి కమిషనర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామానికి చెందిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ జలగడుల శ్రీనివాసరావు, బోనెల జోసెఫ్, కటికల కల్పన శుక్రవారం జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సమావేశాలు సక్రమ పద్ధతిలో జరగాలని మెంబర్లకు చూచించారని పేర్కొన్నారు.

పెద్దచెరువును పరిశీలించిన వాటర్‌మ్యాన్


పెద్ద చెరువు పరిశీలనలో వాటర్ మ్యాన్ రాజేంద్రసింగ్ తదితరులు

ప్రజాశక్తి -తగరపువలస : పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారులు, వాటర్ మ్యాన్ రాజేంద్రసింగ్, జివిఎంసి కార్పొరేటర్ మూర్తి యాదవ్, పర్యావరణ వేత్త జెవి రత్నం, భౌగోళిక శాస్త్రవేత్త రాజశేఖర్‌రెడ్డి, జన సేన రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ తదితరులు చిట్టివలస పెద్ద చెరువును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ చెరువు ఆక్రమణకు గురవ్వడంతో పాటు కాలుష్యంతో నిండి పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. సుమారు 110 జాతులకు చెందిన దేశ, విదేశీ పక్షులు ఏటా ఈ చెరువు వద్దకు వస్తాయని తెలిపారు. గోస్తనీ కూడా ఆక్రమణలకు గురికావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని చెప్పారు. వీటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

పొగాకు దుష్ప్రభావంపై అవగాహన


పొగాకు దుష్ప్రభావంపై టీ షాపు వద్ద అవగాహన కల్పిస్తున్న హెచ్‌సిజి వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : పొగాకు వినియోగం వల్ల కలిగే విషపూరిత ప్రభావలను నొక్కి చెప్పాలనే ఉద్దేశంతో ఆరిలోవ హెల్త్‌సిటీలోని హెచ్‌సిజి కేన్సర్ ఆసుపత్రి 'హావ్ మోర్ టీ - నో మోర్ పఫ్స్' అనే పేరుతో క్యాంపెయిన్ నిర్వహించింది. దీనిలో భాగంగా టీ స్టాల్స్‌లో సిగరెట్ తాగడానికి గుమిగూడే వినియోగదారులకు హావ్ మోర్ టీ - నో మోర్ పఫ్స్ అనే నినాదంతో టీ కప్పులను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా హెల్త్ కేర్ గ్లోబల్ ఎంటర్ ప్రైజస్ లిమిటెడ్ రీజనల్ బిజినెస్ అధినేత ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా నగరవాసులపై శాశ్వత ముద్ర సృష్టించడం, వారి అలవాట్లను పున:పరిశీలించుకోవాలని, చివరికి కేన్సర్ ప్రమాదాన్ని తగ్గించడం లక్ష్యంగా హెచ్‌సిజి పెంటుకుందన్నారు. సిగరెట్ లేకుండా టీని ఆస్వాదించమని వారిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ లింకులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -మధురవాడ : అనవసరమైన లింకులు క్లిక్ చేసి, ఒటిపిలు చెప్పి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని సైబర్ క్రైమ్ సిఐ భవాని ప్రసాద్ సూచించారు. సైబర్ క్రైమ్ స్టేషన్లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగి అధిక మొత్తంలో మోసపోతున్నారని తెలిపారు. గత కొద్దిరోజుల నుంచి అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. హానీట్రాప్, క్రిప్టో కరెన్సీ, ఇన్‌స్టాగ్రాం మోసాలు అధికమయ్యాయన్నారు. అటువైపు నుంచి ఫేక్ ఐడి క్రియేట్ చేయడం వల్ల సాఫ్ట్ వేర్ ఇంజినీర్ మోసపోయారని తెలిపారు. ఒక కిలాడి లేడి ఈయనకు రూ.22 లక్షలకు టోకరా వేసిందన్నారు. ఈ కేసులో నిందితురాలిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఇటువంటి మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు, కాల్స్‌కు స్పందించవద్దని చెప్పారు. మీకు తెలియకుండానే మీ ఫోన్ హ్యాక్ చేస్తారని వివరించారు. డేటింగ్ యాప్, బెట్టింగ్‌లలో రోజూ రూ.కోట్లలో మోసపోతున్నారని తెలిపారు. ఫ్యామిలీ ఫొటోలను ఆన్‌లైన్‌లో ఉంచవద్దన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి, కృష్ణాపురం, మద్ది, కోవ్వాడ గ్రామాల్లో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి చెందిన పనులను బృందం సభ్యులు పరిశీలించారు. గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాల నిర్వహణను, మంచినీటి పథకాలు, బోర్లు, వీధి కుళాయిలను, వీధులు, మురుగు కాలువలను పరిశీలించారు. ఈ కార్యక్రమములో మండల తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పిఎం.పాలెంలో చోరీ

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ రంభ శ్రీనివాసరావు తెలిపారు. పిఎం.పాలెం ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న మణికంఠ ట్రేడర్స్ దుకాణం షటర్లు తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగలు గొట్టి కొన్ని బియ్యం బస్తాలు, రూ.5 వేలు చోరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. షాప్ యజమాని కొండలరావు అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. వారి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వెన్నునొప్పి తాళలేక ఆత్మహత్య

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బోదువలస గ్రామానికి చెందిన గొల్లవిల్లి రాజేశ్వరి (34) వెన్నునొప్పి తాళలేక కలుపు మొక్కల నివారణ కోసం వాడే పురుగుల మందు తాగి మృతి చెందినట్లు స్థానిక సిఐ పిన్నింటి రమణ తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం... బోదువలస గ్రామానికి చెందిన గొల్లవిల్లి రాజేశ్వరి (34) గతంలో మేడపై నుండి జారిపోవడంతో వెన్నుముక భాగం దెబ్బ తగిలి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు వెన్నుముకకు ఆపరేషన్ చేయాలని సూచించారు. దీంతో రాజేశ్వరికి ఆర్థిక స్తోమత లేక వైద్యం చేయించుకోవడానికి డబ్బు లేకపోవడంతో మనస్థాపానికి గురై శుక్రవారం కలుపు మొక్కల నివారణకు ఉపయోగించే (పెస్టిసైడ్) పురుగుల మందు తాగింది. అనంతరం ఆమె వాంతులు చేసుకోవడం ఆమె చిన్న కుమార్తె చూసి తండ్రికి ఫోన్ చేయడంతో రాజేశ్వరి భర్త అప్పలరాజు విశాఖ కెజిహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో రాజేశ్వరి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు సుస్మిత, ప్రవల్లికలు ఉన్నారు. భర్త అప్పలరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మేఘాద్రి దారిలో షాపుల తొలగింపు

ప్రజాశక్తి-పెందుర్తి : నాయుడుతోట నుంచి మేఘాద్రికి వెళ్లే రహదారికిరువైపులా ఉన్న షాపుల తొలగింపును జివిఎంసి సిబ్బంది చేపట్టారు. ఉన్న ఫలంగా తొలగిస్తే వ్యాపారాలు దెబ్బతింటాయని, రెండో రోజులు సమయం కావాలని షాపుల నిర్వాహకులు కోరారు. దీనిపై ఇరువురి మధ్య వాగ్వాదంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా ప్లానింగ్ సెక్రటరీ రాకేష్ షాప్ యాజమానులనుద్దేశించి మాట్లాడుతూ, ఇక్కడ ట్రాఫిక్ సమస్యగా ఉందని పలు ఫిర్యాదులు రావడంతో పైఅధికారులు ఆదేశానుసారం తొలగించడానికి వచ్చామని తెలిపారు. తొలగించడానికి కొంత సమయం కావాలని దకాణదారులు అడుగుతున్న విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి రాకేష్ తీసుకెళ్లారు. కొంత సమయం ఇవ్వడానికి అంగీకరించడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.


నిత్యావసరాలను పంపిణీచేస్తున్న సర్పంచ్ కుటుంబీకులు

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రమైన పద్మనాభం గ్రామపంచాయతీ సర్పంచ్ టి.పాప కుమారుడు మనోహర్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులను టి.పద్మనాభ స్వామి (పద్దు) పంపిణీ చేశారు.

పెద్దిపాలెంలో డిపిఒ తనిఖీలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం సచివాలయంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీరు, శానిటేషన్‌ను పరిశీలించారు. తాగునీరు, కాలువలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రతిరోజూ క్లోరినేషన్ చేసి తాగునీటిని అందించాలన్నారు. గ్రామాల్లో నీటి నిల్వలుంటే దోమలు చేరి వ్యాధుల ప్రబలే ప్రమాదముందని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, ఈఓపిఆర్‌డి రామారావు, గ్రామ కార్యదర్శులు శివప్రసాద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపుపై ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ సెక్టర్-5లోని ఉక్కు హౌస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాన్ని నిరసిస్తూ శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) జనరల్ సెక్రెటరీ నమ్మి రమణ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఇల్లు, భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు పని లేకుండా చేయాలని స్టీల్ యాజమాన్యం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు వచ్చాయని కార్మికులు ఎంతో ఆశగా ఎదురు చూస్తుంటే మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఉపాధికే ఎసరు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు.

సిఐటియు నాయకులు వివి.రమణ మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా ఉక్కు హౌస్, హిల్ టాప్ గెస్ట్ హౌస్, గంగవరం గెస్ట్ హౌస్‌లో పనిచేస్తున్న కార్మికులను కంపెనీకి విచ్చేసిన అతిథులకు రాచమర్యాదలు చేస్తున్నారని తెలిపారు. సేవలందించిన కార్మికులను రోడ్డు మీదకు నెట్టేసే యాజమాన్య వైఖరిని తీవ్రంగా వ్యతిరేకించాలని కార్మిక వర్గానికి ఆయన పిలుపునిచ్చారు. కార్మికులను తొలగించే ప్రతిపాదనను తక్షణమే స్టీల్ యాజమాన్యం ఉపసంహరించుకోకపోతే పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆఫీస్ బ్యారర్లు నాగిరెడ్డి అప్పారావు, వై.రాము, డి.రమణ, ఐ.వెంకటేష్, బాబూరావు, శ్రీను, వెంకట్రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికులు

ఉపాధి హామీలో అవకతవకలపై తనిఖీలు

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని సరిపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులపై పలువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు స్పెషల్ ఆఫీసర్ నిర్మలాదేవి శుక్రవారం తనిఖీ చేపట్టారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఫీల్డ్ అసిస్టెంట్‌పై పలు ఫిర్యాదులు వచ్చాయని, దీనిపై ఇక్కడ రికార్డులు పరిశీలిస్తున్నామని, అవకతవకలు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దీనిపై మేట్‌లు మీడియాతో మాట్లాడుతూ, ఫీల్డ్ అసిస్టెంట్ ఒక్కొక్కరి నుంచి రూ.100 వసూలు చేసి ఇమ్మనడంతో అందరమూ వసూలు చేసి ఇచ్చామని తెలిపారు. పై అధికారులు అడిగినప్పుడు కూడా ఇదే సమాధానం చెబుతామని తెలిపారు.


జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కోన తాతారావు తదితరులు

ఘనంగా దల్లి గోవిందు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 64వ వార్డు జనసేన కార్పొరేటర్ దల్లి గోవిందు జన్మదిన వేడుకలు శుక్రవారం ఆయన నివాసం వద్ద ఘనంగా జరిగాయి. జనసేన జిల్లా నాయకులు, గాజువాక నియోజవర్గ నాయకులు, వార్డు నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి, పూలదండలతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అభిమానులు కేక్‌ని కట్ చేసి సత్కరించారు.


పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి జన్మదిన వేడుకలలో భాగంగా నాతయ్యపాలెంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు పుస్తకాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాతయ్యపాలెం గ్రామ పెద్దలు గోపిసెట్టి దేముడు, సంగ్రాణ వరహాలరాజు, శ్రీరామ్మూర్తి, మండ బుచ్చి నాయుడు, గోళ్లవిల్లి నరసింగరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సెల్‌ఫోన్ టెక్నీషియన్ల నాయకులు

సెల్‌ఫోన్ టెక్నీషియన్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : సెల్ ఫోన్ టెక్నీషియన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సెల్‌ఫోన్ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్ విజ్ఞప్తిచేశారు. విశాఖ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెల్ ఫోన్ టెక్నీషియన్లను కార్మికులుగా గుర్తించి విశ్వకర్మ యువజన పథకం కింద సదుపాయాలు కల్పించాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా సెల్‌ఫోన్ టెక్నీషియన్లకు రాష్ట్ర ప్రభుత్వం ట్రైనింగ్ ద్వారా ఉపాధి కల్పించాలని విజ్ఞప్తిచేశారు. తమ అసోసియేషన్‌లో విశాఖలో 250 మందికి సభ్యత్వం ఉందని, ఈ నెలాఖరుకు 400 మంది దాకా సభ్యత్వం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. టెక్నీషియన్లకు సొసైటీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసాద్, దాము, రాజేష్, అహ్మద్, రాజేష్, అగ్రముష్, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

కెనడాకు గుడివాడ

ప్రజాశక్తి -గాజువాక : మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం వ్యక్తిగత పని మీద కెనడా బయలుదేరారు. వారం రోజులపాటు కెనడాలో ఉంటారని సమాచారం.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన


మాట్లాడుతున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

ప్రజాశక్తి -యంత్రాంగం

ములగాడ : జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలంతా భాగస్వాములై ఈ ఏడాది విశాఖ మొదటి ర్యాంక్‌ను సాధించేలా కృషి చేయాలని కోరారు. తడి-పొడి చెత్తతో పాటు ప్రమాదకర చెత్తగా వేరుచేసి పారిశుధ్య వాహనాలకు అందజేయాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తిచెప్పి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ సాంబమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, వార్డు మలేరియా సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వేపగుంట : గోపాలపట్నంలో స్వచ్ఛసర్వేక్షణ్ అవగాహనా ర్యాలీని నిర్వహించారు. సిఎంఆర్ నుంచి వెంకటాపురం వరకు ర్యాలీ సాగింది. ప్రజలకు, దుకాణదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎస్ఎఫ్ అధికారి లాజరస్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గోపి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ 2024లో విశాఖపట్నం నగరానికి దేశంలోనే మొదటిస్థానం రావడానికి అందరు సంపూర్ణసహకారం అందించాలని కోరారు. ప్రతి దుకాణం ముందు విధిగా 2 డస్ట్ బిన్స్ ఉపయోగించాలని, గుడ్డసంచులు వాడాలని, తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణికుమార్, శోభారాణి, చైతన్యకుమారి, ప్రజలు పాల్గొన్నారు.

బిసిజి వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన డిఎం అండ్ హెచ్‌ఒ

ప్రజాశక్తి-సీతమ్మధార : దొండపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన సచివాలయం, రామాలయం వీధిలో చేపట్టిన అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్‌ను, సెషన్ ప్లానింగ్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పరిశీలించారు. ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ఎనిమియాను గుర్తించి ప్రతి గర్భిణీకి ఐరన్ మాత్రలు అందచేయాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సి-సెక్షన్ ప్రసవాలు నివారించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు తులసీరాజ్, నాగభూషణం పాల్గొన్నారు.

పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి ఎగువపేట అంగన్వాడీ కేంద్రంలో "మిషన్ శక్తి"లో భాగంగా శుక్రవారం ఐసిడిఎస్ అధికారులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు, గృహహింస, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్వాడీలు శాంతి కుమారి పాల్గొన్నారు.

పలుచోట్ల ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి -యంత్రాంగం

విశాఖలో పలుచోట్ల శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. దోమల నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

భీమునిపట్నం : మండలంలోని ఆర్.తాళ్లవలస, టి.నగరపాలెం, అమనాం పంచాయతీల్లోని పలు గ్రామాల్లో డ్వాక్రా మహిళల ఆధ్వర్యాన దోమల నివారణపై అవగాహన ర్యాలీ, డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు ఎపిఎం బి.రంగారావు, సిసి మీసాల అప్పలనారాయణ డ్రై డే ప్రాధాన్యతను వివరించారు. ఆరోగ్య కార్యకర్తలు, విఒఎలు పాల్గొన్నారు.

జివిఎంసి మూడో వార్డు పరిధిలో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎగువపేట నుంచి ప్రభుత్వ ఆసుపత్రి, మెయిన్ రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గంటా అప్పల కొండ, మాజీ కౌన్సిలర్లు గంటా నూకరాజు, పి.లక్ష్మీకుమారి, టిడిపి నాయకులు చురకల రమణ, పైడిపల్లి నరసింగరావు, కొక్కిరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి శివశక్తినగర్‌లో జోన్-2 కమిషనర్ శైలజవల్లి ఆధ్వర్యాన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ మొల్లిహేమలత మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటరీ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఒహెచ్ఒ కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంట ముత్యమంబ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఎఎన్ఎం సునీత వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి, గర్భిణులు, పిల్లలు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి ఏనుగులపాలెంలో దోమల నివారణపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఎపిఎం వి.ప్రభాకర్ వివరించారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రై డే నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, సిసి లక్ష్మి, విఒఎ, గ్రామ సంఘ ప్రతినిధులు, ఎఎన్ఎం, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం మండలం కనమాం గ్రామ సంఘం సభ్యుల ఆధ్వర్యాన దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి ఆనందపురం ఎపిఎం జి.నాగభూషణరావు మాట్లాడుతూ, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, దోమలు పెరగకుండా డ్రై డే పాటించడాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సీసీ కనకబాబు, గ్రామ సంఘ ప్రతినిధులు, ఎస్‌హెచ్‌జి సభ్యులు, ఎఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం : జివిఎంసి 56వ వార్డు పరిధి గవర కంచరపాలెంలో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రాజశేఖర్, జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, సహాయ వైద్యాధికారి సునీల్‌కుమార్, ఎస్ఎస్.జనార్దన్, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

గాజువాక : జివిఎంసి 72వ వార్డు పరిధి చినగంట్యాడలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఒహెచ్ఒ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, నిల్వ ఉండే నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, డెంగీ, మలేరియా, డయేరియా లాంటి వ్యాధులు ప్రబలుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, యుసిడి సూర్యనారాయణ, శానిటరీ, మలేరియా ఇన్‌స్పెక్టర్లు ఈశ్వరరావు, శ్రీనివాస్, ఆర్‌పి అప్పారి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


పద్మనాభం మండలం ఏనుగులపాలెంలో అవగాహన ర్యాలీ

కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం నిరసనలు



ఆరిలోవలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటూ సిపిఎం ఆధ్వర్యాన పలుచోట్ల శుక్రవారమూ నిరసనలు తెలిపారు.

మధురవాడ : సిపిఎం, సిఐటియు మధురవాడ జోన్ కమిటీల ఆధ్వర్యాన జివిఎంసి 7వ వార్డు పరిధి మార్కెట్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రం పట్ల వివక్షను కొనసాగించారని తెలిపారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపి విధానాలపై ప్రజలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్‌కుమార్, కార్యకర్తలు జి.చిన్నారావు, వి.గోవిందా, జగదీష్, సిపిఎం కార్యకర్తలు ఎజి.రెడ్డి, కె.సుజాత, డి.తులసి, దివ్య తదితరులు పాల్గొన్నారు.



మధురవాడలో...

ఆరిలోవ : సిపిఎం ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన ఆరిలోవ టిఐసి పాయింట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఎపిలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా బడ్జెట్‌లో ఎపికి తగిన నిధులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు ఎస్.రంగమ్మ, పి.శంకర్రావు, కె.సత్యనారాయణ, వి.కాంతం, వి.తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయింపులో ఏపికి కోత విధించడం సరికాదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు మొల్లేటి గౌరీశ్వరరావు, సాలాపు బంగారయ్య, రామలక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి, వెనకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాలకు తీవ్ర ద్రోహం చేసిందని సిపిఎం మండల నాయకులు వనుం సూర్యనారాయణ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కి నిధులు, ప్రత్యేక హోదా విభజన హామీలు, పోలవరానికి నిధులు, నిర్వాసితులకు పునరావాసం బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఈ రాష్ట్రంలో జనసేన, టిడిపిలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆంధ్ర రాష్ట్రాన్ని ఆర్థిక సమస్యల నుండి కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యర్రా దేముడు, చెంబు నాయుడు, అప్పారావు, శివ, ఈశ్వరరావు పాల్గొన్నారు.



కె.కోటపాడులో...

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి ఏమి మేలు జరిగింది?

దేవరాపల్లి : ఈ నెల 23న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు ఏమి మేలు జరిగిందని రాష్ట్రంలో కూటమి నేతలు హర్షద్వానాలు తెలువుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. అమరావతికి రూ.15వేలు కోట్లు ప్రపంచ బ్యాంకు నుండి అప్పుగా ఇప్పిస్తామని కేంద్ర మంత్రి చెప్పగా, గ్రాంటుగా ఇస్తున్నట్లు కొండంత అబద్ధాన్ని ఈ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ చెప్పడం దారుణమన్నారు. పోలవరం గురించి కూడా అలాంటి అబద్ధాలే చెబుతున్నారన్నారు. బిజెపి నేతల మోసాలను టిడిపి నాయకులు అర్థం చేసుకోవాలని హితవుపలికారు.



సబ్బవరంలో..


వినతిపత్రం ఇస్తున్న వికలాంగులు

స్మితా సబర్వాల్ వికలాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలంగాణ సీనియర్ ఐఎఎస్ అధికారి స్మితా సబర్వాల్ వికలాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరుతూ శుక్రవారం అనకాపల్లి ఆర్డీవో ఆఫీస్ వద్ద వికలాంగుల సంఘాల నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్మితా సబర్వాల్‌పై 2016 దివ్యాంగుల హక్కుల చట్ట ప్రకారం ఆమెపై కేసు నమోదు చేయాలని కోరారు. ఆమెను తక్షణమే ఉద్యోగ బాధ్యతలు నుంచి తప్పించి తగు చర్యలు తీసుకోని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు వివిఎన్ సూరి అప్పారావు, ఆర్ భాస్కర్, పి సన్యాసిరావు, బుగిడి నూక అప్పారావు, నాదముని ఫణీంద్ర పాల్గొన్నారు.


విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న డిఇఒ

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి- కశింకోట : పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. స్థానిక బాలికల హైస్కూల్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌లు, ల్యాబ్‌లు, విద్యా బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డ్రెస్ మేకింగ్ చూశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 సూర్యనారాయణమూర్తి, హైస్కూల్ హెచ్ఎం ఎంఎస్.స్వర్ణకుమారి, పిడి పెంటకోట కమల, డిఎస్‌ఓ కాళీదాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

తహశీల్దారుకు సత్కారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎన్నికల విధుల నిమిత్తం అచ్యుతాపురం వచ్చిన తహశీల్దారు బి.సరోజినిని శుక్రవారం అచ్యుతాపురం రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిటి నీరజ, ఎంపీడీవో సురేష్ కుమార్, ఆర్ఐ సోమేష్ కుమార్, విఆర్ఒలు శశి, పలివెల వెంకటరావు, సింహాచలం నాయుడు, సత్య, చిన్నప్పారావు, శ్రీను, మహేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగ జగదీష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు జన్మదిన వేడుకలు అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో కార్యకర్తల నడుమ శుక్రవారం ఘనంగా జరిగాయి. మొదటిగా కేకును జగదీష్ కుమారుడు నూకేష్, మనుమడు ఆర్యన్ నేతృత్వంలో కట్ చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి పట్టణంలో ఉన్న పేద వర్గాలకు సుమారు 350 మందికి రగ్గులు పంపిణీ చేశారు. నాగ జగదీష్ జన్మదినం సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టిడిపి నాయకులు పొలిమేర నాయుడు, దూలం ప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాసరావు, కొండ్రేగుల సత్యనారాయణ, మాధంశెట్టి నీలాబాబు, బొడ్డేడ మురళి, శంకర పద్మలత, మళ్ళ గణేష్, మళ్ళ శివన్నారాయణ, కుప్పిలి జగన్మోహన్రావు, బోడి వెంకట్రావు, బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, ధనాల విష్ణు చౌదరి ఇతర నాయకులు పాల్గొన్నారు.


ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

ఎన్‌టిపిసి సింహాద్రికి

'రాజభాష గౌరవ్ సమ్మాన్ 2023-24' అవార్డు

ప్రజాశక్తి-పరవాడ

స్థానిక ఎన్‌టిపిసి సింహాద్రి రాజభాష గౌరవ్ సమ్మాన్ 2023-24 అవార్డు సాధించింది. ఈ మేరకు విశాఖపట్నంలోని హోటల్ నోవాటెల్‌లో గురువారం జరిగిన 15వ పట్టణ అధికార భాషా కమిటీ 'అండర్ టేకింగ్' సమావేశంలో ఎన్‌టిపిసి సింహాద్రిని 2వ బహుమతి 'రాజభాష గౌరవ్ సమ్మాన్'తో సత్కరించారు. అధికారిక భాష హిందీ రంగంలో కేటగిరీ-1 కార్యాలయం కింద ఎన్టీపీసీ సింహాద్రి 2023-24 సంవత్సరంలో చేసిన అద్భుతమైన పనికి గుర్తింపుగా టోల్ సి ఈ అవార్డును అందించింది. ఈ అవార్డును సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా హెచ్ఆర్ హెడ్ భక్త బత్సలపాత్ర అందుకున్నారు. అదనంగా ఎన్టీపీసీ సింహాద్రిలో రాజ్‌భాషా అమలుకు గణనీయమైన కృషిని గుర్తిస్తూ, ఎగ్జిక్యూటివ్ కార్పొరేట్ కమ్యూనికేషన్, రాజభాష ప్రతినిధి అఖిలేష్ త్రిపాఠిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎండి రీనల్, అతుల్ భట్, బోలిసెట్టి అండర్‌టేకింగ్, డిప్యూటీ డైరెక్టర్ ఇంప్లిమెంటేషన్ అనిర్బన్ కుమార్ బిస్వాస్, రీజనల్ ఇంప్లిమెంటేషన్ ఆఫీస్, బెంగళూరు, అధికారిక భాషా విభాగం, హోం మంత్రిత్వ శాఖ, ఇతర సభ్యులతో పాటు వివిధ కార్యాలయాల అధికారులు పాల్గొన్నారు. అంతేకాకుండా, సింహాద్రిలో అధికారిక భాషా విభాగం (మానవ వనరు) సాధించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ హెచ్ఓపి సంజయ్ కుమార్ సిన్హా మొత్తం బృందాన్ని అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ఎన్‌టిపిసి సింహాద్రి అధికారులు

రైవాడలో గ్రామసభ

ప్రజాశక్తి-దేవరపల్లి : గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుపరచాలని సర్పంచ్ చల్ల లక్ష్మి అన్నారు. మండలంలోని రైవాడ గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభ సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి టి లక్ష్మి మాట్లాడుతూ మురికి కాలువలు శుభ్రం చేయనున్నట్లు చెప్పారు. వీఆర్వో నాగేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో కౌలు రైతులు ఉంటే కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చల్ల నానాజీ, చల్ల తాతయ్యలు, చల్ల నాయుడు, మిడతాడ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ చల్ల లక్ష్మి



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు

ప్రజాశక్తి-సబ్బవరం

అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయ కృష్ణన్‌ను ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా యూనిట్ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఏపీజీఈఎ అధ్యక్షులు జివి.రమణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.బాబురావు, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు పి.అప్పారావు, కార్య వర్గం సభ్యులు సుధాకర్, శ్రీనివాస్, జీలాని, గిరిజాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు పాల్గొన్న సర్పంచ్ సుజాత

జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్, జనసేన పార్టీ నాయకురాలు చింతకాయల సూజాత మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మత్స్యకారులు నిత్యం సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళి రావడం అనేది ఒక సాహసంతో కూడిన జీవనాధారమని, నిత్యం ప్రమాదాలు జరుగుతునే వుంటాయని, అందుకు గాను జనసేన పార్టీ సభ్యత్వంతో కూడిన బీమా సౌకర్యం వలన మత్స్యకారులు కుటుంబాలు ధీమగా ఉండవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, జనసేన నాయకులు సూరాడ ముత్యాలరావు, మైలపల్లి బంగారు రాజు, కోవిరి రాయుడు, అర్జిల్లి కృష్ణ, గనగళ్ళ కోందండరావు, సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి తాతారావు, ఒలిశెట్టి అప్పలరాజు, కణితి చినసోమేష్, సమ్మంగి అప్పలరాజు, మెరిగి రాజబాబు, అర్జిల్లి మధు, కంబాల గురువోజీ, సమ్మంగి ముత్యాలు పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఉద్యాన పంటల్లో తెగుళ్ళ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.ప్రభాకర్‌రావు సూచించారు. మండలంలో నరేంద్రపురం మల్లవరం గ్రామాలలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పామ్ ఆయల్ తోటలు, బొప్పాయి పంటలను పరిశీలించారు. ఈ పంటల్లో కొమ్ము పురుగు, బొప్పాయికి వైరస్ తెగుళ్లను పరిశీలించి రైతులకు తగు చూచనలు చేశారు. పంటలకు సోకిన తెగుళ్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఆర్థికంగా రైతులు నష్టపోతారని తెలిపారు. ఈ



బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధి హామీ కూలీలకు

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి- మునగపాక

మండలంలోని ఉపాధి హామీ పథకం కింద పని చేసిన కూలీలకు 11 వారాల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని వాడ్రాపల్లి గ్రామ సచివాలయం వద్ద ఉపాధి కూలీలతో కలిసి శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఉపాధి కూలీల బకాయిలు, కౌలుదారులకు కార్డులు, రుణాలు, పంట నష్ట నమోదు తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ కార్యదర్శికి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూలీలకు 11 వారాలుగా వేతన బకాయిలు ఇవ్వకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. విడుదల చేసిన నిధులను నామమాత్రపు కాంట్రాక్టర్లకు కట్టబెట్టి పేదలను ఆకలి బాధలకు గురిచేయడం అన్యాయమన్నారు. ఈనెల 29న మండల వ్యాప్తంగా ఉపాధి కూలీలను సమీకరించి ఉపాధి హామీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి జగ్గ అప్పారావు, లక్ష్మనరావు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు, ఉపాధి హామీ కూలీలు

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి



డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న కాశీ విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండి చక్కగా చదువుకోని మంచి ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖ అధికారి బి కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంకేతిక విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ చెడు అలవాట్లు, మొబైల్ ఫోన్లకు బానిస కావొద్దని సూచించారు. విద్యార్థులకు గోల్డ్ సెట్టింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యారావు, ఉపాధ్యాయులు డివిజే అప్పారావు, ఒమ్మి అప్పారావు, వెంకటేష్,ప్రత్యేక ఉపాధ్యాయులు అప్పలరాజు, సిఆర్పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డిజిటల్ వనరుల వినియోగంపై ప్రదర్శన

కె.కోటపాడు : శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ వనరుల వినియోగంపై మండలంలోని ఏ.కోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనిని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మురళీమోహన్ పట్నాయక్ సందర్శించి విద్యార్థులు వినియోగిస్తున్న ట్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1, 2 సత్యనారాయణ, డివిడి ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-చోడవరం

పంచాయతీలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించేందుకు పట్టణంలోని నాలుగు సచివాలయాల సిబ్బంది అప్రమత్తంగా ఉండి పని చేయించాలని పంచాయతీ ఈవో నారాయణరావు కోరారు. శుక్రవారం చోడవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో సచివాలయం ఉద్యోగులు, సభ్యులు, పట్టణ ప్రజలతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా పడుతూ ఉండటం వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, దోమల సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రతిరోజు పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు.



మాట్లాడుతున్న ఇఒ నారాయణరావు

కార్యక్రమంలో సర్పంచ్ బండి సూకాలమ్మ, వార్డు సభ్యులు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ చైన్ టెక్నాలజీ, అప్లికేషన్‌పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాల, ఎన్ఐటి వరంగల్ అనుసంధానంతో బ్లాక్ చైన్ టెక్నాలజీస్ అండ్ అప్లికేషన్స్ పైన ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం 40గంటలు పాటూ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్‌గా ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ బాబు, ఎన్ఐటి తీర్చి అసోసియేట్ ప్రొఫెసర్ కున్వార్ సింగ్, అస్సిస్టాంట్ ప్రొఫెసర్ చంద్ర శేఖర్, ఎన్ఐటి రాయపూర్ అసోసియేట్ ప్రొఫెసర్ రమేష్ బాబు బత్తుల, ఎన్ఐటి జైపూర్ ప్రొఫెసర్ శ్రీనివాస రావు, ఎన్ఐటి వరంగల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సైల్ నామసూద్ర, ఎన్ఐటి సిల్చార్ ప్రొఫెసర్ సురేష్ బాబు, ఎన్ఐటి వరంగల్, ప్రశాంత్ సాహూ, టిసిస్ పాల్గొన్నారు. ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఎన్ఐటి వరంగల్ కో ఆర్డినేటర్‌గా సురేష్ బాబు, కాలేజీ కో ఆర్డినేటర్‌గా సిఎస్ఈ విభాగాధిపతి కె సుజాత వ్యవహరించారు. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో జరుగుతున్నా సైబర్ అటాక్స్‌ను ఎలా బ్లాక్ చైన్ టెక్నాలజీస్ వినియోగించి భద్రత పెంపొందించవచ్చు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విభాగాల నుంచి అధ్యాపకులు, కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠ రావు, డీన్ అడ్మిన్ ఈశ్వర్‌రావు, అకాడమిక్స్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, వివిధ విభాగ అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు

సురక్షిత డ్రైవింగ్‌పై ఆటో డ్రైవర్లు శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-మునగపాక

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలంటే ఆటో డ్రైవర్లు సురక్షిత డ్రైవింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానిక ఎస్సై ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని గనపర్తి గ్రామంలో ఆటో డ్రైవర్ల యూనియన్ సభ్యులతో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదాలకు మూలమని, పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపకూడదని హితవుపలికారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, ఫ్రంట్ సీటింగ్ నేరమని పేర్కొన్నారు.



ఎన్నికైన లీడర్స్‌తో ఉపాధ్యాయులు

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్కూల్ పెట్రాన్ కేనాన్ జాన్ అన్నారు. స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో కెప్టెన్, వైస్ కెప్టెన్ నియామకం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబెల్ కుమార్, కరస్పాండెంట్ బి.అనురాధ, ప్రిన్సిపాల్, పాల్గొన్నారు.

జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఆగస్టు 6న నర్సీపట్నంలో జరుగు సిపిఐ జిల్లా విస్తృత సమావేశంలో పార్టీ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం సిపిఐ మండల కార్యదర్శి గరికిన రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పాడైన రోడ్లపై గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు విద్య వైద్యంపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు వేమల కన్నబాబు, రాజాబాబు, బీర సింహాద్రప్పుడు, కూడా ప్రకాష్, దేవా పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్ వద్ద హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక పంచాయతీ పరిధిలో ఉన్న అక్రమ లేఅవుట్లు వ్యవహారంపై శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శి నోటీసు బోర్డు పెట్టారు. ఉడుమడక పంచాయతీ పూడిమడక పంచాయతీ పరిధిలో ఎటువంటి లేఔట్లకు అనుమతులు ఇవ్వలేదని నోటీసు బోర్డులో తెలిపారు అక్రమంగా చేసిన లేఅవుట్ చల్ల నేరదని హెచ్చరించారు. అటువంటి అక్రమ లేఔట్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

రహదారి భద్రతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గీతా ప్రైమరీ హైస్కూల్‌లో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్, వెహికల్ ఇన్స్పెక్టర్ పి.గోపికృష్ణ మాట్లాడుతూ మైనర్ బాలబాలికలు వాహనాలు నడప రాదని, నడిపితే జరిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎస్. అన్నారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీట మునిగిన వీధుల పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీలు లేక పూర్తిగా నీట మునిగిన మండలంలోని పరవాడపాలెం ఎన్టీఆర్ కాలనీని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ పీలా గోవింద సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బలిజి మంగ ముసిలి నాయుడు, ఉప సర్పంచ్ గొంతిని ఈశ్వరరావు, శానాపతి కృష్ణ, మడక శ్రీను, పక్కుర్తి కామరాజు, రెడ్డి గణేష్, మామిడి నాగేంద్ర, మామిడి రాజు, జగతా రాజేంద్ర, సలాది సతీష్, గంగాధర్ పాల్గొన్నారు.

కల్యాణపులోవ నుంచి నీరు విడుదల

పరివాహక ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

ప్రజాశక్తి - కొత్తకోట:రావికమతం మండలం లో గుడివాడ గురునాధరావు కళ్యాణపులోవ జలాశయం లోకి చేరుతున్న వరద నీటిని రెండు గేట్ల ద్వారా సుమారు 100 క్యూ సెక్కుల నీటిని సర్పా నదిలో విడుదల చేసినట్టు జలాశయం ఏఈ సత్యనారాయణ దొర చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 460 అడుగుల కాగా ప్రస్తుతం 459.20 అడుగుల ప్రమాద స్థాయికి చేరిందన్నారు.. ప్రస్తుతం ఇన్ ఫ్లో 75 క్యూసుక్కుల నీరు జలాశయం లో చేరగా రెండు గేట్లు ద్వారా సాయంత్రం 100 క్యుసుక్కుల నీరు దిగువకు సర్పా నదిలోనికి విడుదల చేశామని వివరించా రు. పరివాహక ప్రాంతంలో ఇన్ ఫ్లో పెరిగే కొద్ది మిగిలిన గేట్ల ద్వారా దిగువకు (నది)లోనికి నీరును విడిచిపెట్టడం జరుగు తుందన్నారు. సర్పానదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రెవిన్యూ అధికారులకు సమాచారం అందజేసినట్టు పేర్కొన్నారు..



కల్యాణపులోవ నుంచి విడుదలవుతున్న నీరు

పలుచోట్ల కార్గిల్ విజయ్‌దివస్



విశాఖలో యుద్ధవీరున్ని సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-యంత్రాంగం

కార్గిల్ విజయ దివస్‌ను పలుచోట్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ అమరవీరులకు నివాళులర్పించారు.

ఎంవిపి.కాలనీ : తూర్పు నావికాదళం ఆధ్వర్యాన ఆర్‌కె బీచ్‌లోని యుద్ధ స్మారక చిహ్నం వద్ద కార్గిల్ అమర వీరులకు ఘన నివాళి అర్పించారు. తూర్పు నావికా దళ చీఫ్ ఆఫ్ స్టాఫ్, వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా, విశాఖ పోలీసు కమిషనర్ శంకబ్రతా బాగ్చి పాల్గొన్నారు. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్.శాస్త్రి పాల్గొన్నారు.

ఏ క్రియేటివ్ మేకర్స్ ఇన్ ఈవెంట్స్ (యక్మి) ఆధ్వర్యంలో కార్గిల్ విజయంలో పాల్గొని దేశానికి విశేష సేవలు అందించిన వారిని సత్కరించే కార్యక్రమం 'భారతీయం' పేరుతో మద్దిలపాలెంలోని కళాభారతిలో నిర్వహించారు. సిపి శంకబ్రతా బాగ్చి మాట్లాడారు. సరిహద్దుల్లో సైనికుల పోరాటాల వల్లే మనం ఇక్కడ ప్రశాంతంగా ఉన్నామని అన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధ సమయంలో కార్గిల్ ఆపరేషన్ విజయ్‌లో పాల్గొన్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారి వేణుగోపాలరావును, ఇండియన్ ఆర్మీలో సేవలందించిన కనకరాజు, షుభాన్ షైక్‌ను, ఐ స్టాండ్ ఫర్ ఇండియా పేరుతో దేశవ్యాప్తంగా ఉద్యమం నిర్వహించిన రతన్ రాజ్‌లను సత్కరించారు. కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ పివి.శేషగిరిరావు, గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్ఎస్.రావు ప్రముఖ వ్యాపారవేత్త కృష్ణ ప్రసాద్, వైశ్యరాజు జ్యుయలర్స్ అధినేత వైశ్యరాజు భద్రగిరిరావు పాల్గొన్నారు.

పెందుర్తి : సుజాతనగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో కార్గిల్ విజయ దివస్‌ను నిర్వహించారు. కార్గిల్ యుద్ధ పర్యవసానాలను నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ఎన్ .వెంకటేష్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప పాల్గొన్నారు.

విశాఖపట్నం : ఏయూ విద్య విభాగంలో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. దేశ ప్రజల రక్షణ, భద్రత కోసం వీరోచిత పోరాటాలు చేస్తూ, ప్రాణాలను సైతం అర్పిస్తున్న వీర సైనికుల త్యాగాలను యువతరం ఎప్పుడూ గుర్తుచేసుకోవాలని ఏయూ విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు పేర్కొన్నారు. ఎయు దూరవిద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్ మోహన్, ఆర్మీ హవాల్దార్ హెచ్‌ఒవి శ్యామల రావు, మహేంధర్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎయు ఎన్ఎస్‌సి అధికారి డాక్టర్ ఎన్ఎం.యుగంధర్, విభాగ బిఒఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగరాజ కుమారి, బోధన సిబ్బంది డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గాజువాక: జివిఎంసి 70వ వార్డు పరిధి శ్రీసాయి విద్యానికేతన్ స్కూల్లో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు.

మాజీ సైనికులు ఎన్.శ్రీనివాసరావును, ఎస్.సురేష్‌కుమార్ (నేవీ)ను ప్రిన్సిపాల్ రవికుమార్ సత్కరించారు. కార్గిల్ యుద్ధంలో కొన్ని భయంకరమైన సన్నివేశాలను వారు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధురవాడ : కార్గిల్ విజయం వెనక వారి త్యాగాలను స్మరించుకుంటూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ దివస్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం క్రీడా విభాగం మరియు ఎన్‌సిసి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారత రక్షణ దళాల మాజీ అధికారి, ఎన్‌సిసి బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ గోపేంద్ర ముఖ్యఅతిథిగా హజరయ్యారు. గౌరవ అతిథిగా కవితా బండారి హజరయ్యారు. దేశ రక్షణ దళాల త్యాగాలు వెలకట్టలేనివని, దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన కార్గిల్ వీరులను ఎన్నడూ మరవరాదని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థులు సద్భావన ర్యాలీని నిర్వహించారు. గీతంలోని గాంధీ మహత్ముని విగ్రహం వద్ద కార్గిల్ అమర వీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్, వివిధ విభాగాల అధిపతులు, గీతం సెక్యూరిటి టీమ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : అగనంపూడి సిడబ్ల్యూసిలో కార్గల్ విజయ్ దివస్ నిర్వహించారు. అగనంపూడిలోని మాజీ సైనికులను ముఖ్య అతిథి దువ్వాడ సిఐ వివిసిఎంఎర్రమనాయుడు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, ఆశా సైనింగ్స్ సొసైటీ ఫౌండర్ సెక్రటరీ డాక్టర్ పులగపురి ఆశలత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం రేంజర్స్ డిఫెన్స్ కాలేజీ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాజీ సైనికులు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యంను సన్మానించారు. కార్యక్రమంలో సిఐ పిన్నింటి రమణ, గొంప నరసింగరావు, శ్రీనివాసవర్మ, రెడ్డి రామునాయుడు, అకాడమీ కరెస్పాండంట్ పోతల సత్యనారాయణ, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : శ్రీ వివేకానంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా చోడవరం సుమారు 300 మంది విద్యార్థులు అమరవీరులకు వందనాలు అర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు జి.జయలక్ష్మి, గణేష్, కళాశాల ప్రిన్సిపాల్ పూసర్ల సంతోష్ కుమార్, వేచలపు అర్జునరావు, అదట్రావు రామారావు, చీపురుపల్లి దేముడు నాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : కార్గిల్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పదో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ విద్య మాట్లాడుతూ దేశం కోసం పోరాడుతున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ జూనియర్ జడ్జ్ రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంజెవిఎన్ కుమార్, సెక్రెటరీ దుర్గారావు, ఉపాధ్యక్షులు రోజా తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:కార్గిల్ విజయ్ దివాస్‌ను పురస్కరించుకుని స్థానిక కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ శ్రీకన్య జంక్షన్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ర్యాలీ కొనసాగింది. బీజేపీ కో కన్వీనర్ వెలగా జగన్నాథ్, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి:కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా స్థానిక సుబ్బిరామిరెడ్డి కళ్యాణమండపం వద్ద కూటమి నాయకులు అమర జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం మాజీ సైనికులను సత్కరించారు.స్థానిక జూనియర్ కళాశాల లో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోసూరి శ్రీనివాసరావు, పాకలపాటి రవిరాజు, జోగినాయుడు మాస్టర్, వేముల వెంకటరమణ, కోసూరు నానిబాబు, దేవరపు లోవరాజు, సేనాపతి సూర్యారావు, నున్న నూకేష్, గణపతి, మాజీ సైనికులు నాయుడు, బోందలపు అప్పారావు, కోరుకోండి రమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిగా దుర్గాదేవి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక దుర్గా భవానీ పీఠంలో దుర్గాదేవి అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించారు. గురు భవాని దవరసింగి రాంబాబు శుక్రవారం దుర్గాదేవి అమ్మవారిని పలు రకాల కూరగాయాలు, ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం శుక్రవారం కావడంతో అమ్మవారి పీఠాన్ని కూరగాయలతో అలంకరించినట్లు రాంబాబు తెలిపారు .

గొలుగొండ:మండలంలోని అమ్మపేట గ్రామంలో మరిడి మహాలక్ష్మీ అమ్మవారిని శాకాంబరిగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది.

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం స్థానిక రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీకాంత్ కు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ముందు శ్రీకాకుళం జిల్లా నుంచి తహసీల్దార్ శ్రీకాంత్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా ఆయన శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ నరేష్, డిటి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. తక్కువ సమయంలో అందరి మన్ననలు పొందారని కొనియాడారు. అనంతరం తహసీల్దార్ శ్రీకాంత్ ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిటి. చైనులు, ఆర్ఐ కన్నబాబు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న ఉద్యోగులు



పరిశీలిస్తున్న అధికారులు

తాండవ కాలువలో పూడిక తీయాలి

ప్రజాశక్తి-నాతవరం:మండల కేంద్రంలో సెక్షన్ కార్యాలయం వద్ద తాండవ రిజర్వాయర్ నీటి విడుదలపై రైతులతో సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. రైతుల అభిప్రాయం మేరకే తాండవ నీటిని విడుదల చేస్తామని తాండవ ప్రాజెక్ట్ డిఈ అనురాధ తెలిపారు. ప్రస్తుత తాండవ జలాశయంలో 371 అడుగులు నీరు ఉందన్నారు. ఈ సమావేశంలో రైతులు మాట్లాడుతూ, తాండవ జలాశయం నుండి నీటిని విడుదల చేసే ముందు తాండవ ఎడమ, కుడి కాలువలో మట్టిని, తుప్పలను తొలగించాలని కోరారు. ఆగస్టు 15 తర్వాత నీటిని విడుదల చేస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం డిఈ అనురాధ, మాజీ జడ్పిటిసి సత్యనారాయణ , టిడిపి నాయకులు తాండవ నదిపై ఉన్న కెనాల్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జడ్పిటిసి కాపారపు అప్పల నరస, మాజీ జెడ్పిటిసి కనక సత్యనారాయణ, నాతవరం టిడిపి అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం టిడిపి పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగ స్వామి, కనక రాజు, పైల పోతురాజు, పారుపల్లి కొండబాబు పాల్గొన్నారు.

బుడ్డిబందలో చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కవగుంట పంచాయితి శివారు బుడ్డిబంద గ్రామంలో చెత్త బుట్టలను సర్పంచ్ దాసరి సూర్య కుమారి, ఉప సర్పంచ్ కె.గంగా భవాని, మాజీ ఎంపీటీసీ గుళ్ళ వరహాలదొర చేతులు మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామంలో సుమారు 50 కుటుంబాలకు వీటిని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాలలో ఎక్కడబడితే అక్కడ చెత్త చెదారం వేయడం శ్రేయస్కారం కాదన్నారు.చెత్తను ఈ బుట్టలలో వేసుకొని తదుపరి గ్రీన్ అంబాసడర్ వాహనానికి ఆందజే యాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ గుళ్ళ బాబి, గంగరాజు, ఎం.రవి, పి.మహేశ్ పాల్గొన్నారు.



బుట్టలు ఇస్తున్న సర్పంచ్, తదితరులు

సర్పంచ్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సీహెచ్. నాగాపురం పంచాయతీ సర్పంచ్ యలమంచిలి రఘు రామచంద్రరావుపై మాజీ సర్పంచ్ కొలగాన రామారావు, జనసేన పార్టీ నాయకులు రేగుబల్ల శివ, టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్ శుక్రవారం కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. రూ.11.50లక్షల టీటీడీ నిధులు అక్రమాలకు పాల్పడ్డారని, విచారణ చేసి న్యాయం చేయాలని వారు ఫిర్యాదులో కోరారు.

పప్పుశెట్టిపాలెంలో గ్రామసభ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో పంచాయితీ ద్వారా నిర్వహించిన పనులు, వాటికి ఖర్చు చేసిన నిధులపై చర్చించారు. రెవెన్యూ పరిధిలో ఇచ్చిన పట్టాలపై పలువురు ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, కార్యదర్శి రఘురాం, సచివాలయ కార్యదర్శి శ్యామ్‌కుమారి, వార్డు మెంబర్లు, మాజీ సర్పంచ్ బెల్లపు కొండలరావు, గొడ్డేటి రాజుబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



హాజరైన నాయకులు, సిబ్బంది

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కనీస వేతనాలు చెల్లించాలి - సిఐటియు నేతల డిమాండ్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండలంలో పంచాయతీ కార్మికుల పరిష్కరించాలని సిఐటియు నాయకులు ఈ రెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ర్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులకు నూనెలు, చేతి తొడుగులు వంటివి ఇవ్వాలని కోరారు. కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే నెలల తరబడి కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువు ధరలు రోజుకి పెరుగుతున్నాయని కార్మికుల వేతనం మాత్రం పెంచలేదన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్మికులు ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు


బురదగా ఉన్న రోడ్డుపై వెళుతున్న విద్యార్థులు

బురదమయంగా పాఠశాల రోడ్డు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని పెదపేట గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు సరైన రహదారి లేక పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యాశాఖాధికారులు, మండల ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి గ్రావెల్ వేయించుటకు నిధులు మంజూరు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉదయశ్రీ

సంపద సృష్టి కేంద్రాలను వినియోగించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల వ్యాప్తంగా నిర్మాణాలు పూర్తయిన సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని మండల ప్రత్యేక అధికారిని ఉదయశ్రీ సూచించారు. శుక్రవారం ఆమె మండలంలో బికేపల్లి, ఎండపల్లి గ్రామాలలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుద్ధమైన తాగునీటిని అందజేయాలని సూచించారు. బికేపల్లి గ్రామంలో ఆధార్ సెంటర్ను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి సకాలంలో పౌర సేవలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి స్వామి నాయుడు, కార్యదర్శి సంతోషి పాల్గొన్నారు.


బాక్సర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న కోచ్

నేషనల్ టోర్నమెంట్కు ఇద్దరు బాక్సర్లు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నేషనల్ స్థాయి ఉషు టోర్నమెంట్కు నర్సీపట్నంకు చెందిన ఇద్దరు బాక్సర్లు పయనమయ్యారు. గత నెల ఉషా అసోసియేషన్ నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ యూత్ చాంపియనిన్షిప్ టోర్నమెంట్ల నింజాస్ అకాడమీ క్రీడాకారులు విత్తనాల లోకేష్ 60కేజీలు(18), రౌతు నాగ లక్ష్మి 56 కేజీలు(18)లో బంగారు పతకాలు సాధించారు. దీంతో వీరు ఈ నెల 27 నుండి కోయంబత్తూరులో నేషనల్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని సీనియర్ కోచ్ యర్రా శేఖర్, ఎన్ఐఎస్ కోచ్ ప్రియాంక తెలిపారు.వీరు మంచి మెడల్స్ సాధించాలని అకాడెమీ డైరెక్టర్లు ఆకాంక్షించారు.

రంగురాళ్ల క్వారీ వద్ద పహారా

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టిపాలెం రంగురాళ్ల క్వారీ వద్ద రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది పహారా కాస్తున్నారు. పగలు, రాత్రి కలిపి రోజుకు ఏడుగురు బందోబస్తు నిర్వహిస్తున్నారు. క్వారీ ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని గొలుగొండ ఎస్సై కృష్ణారావు తెలిపారు. ఎవరైనా తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


టీకాలు వేస్తున్న లైవ్ స్టాక్ అసిస్టెంట్

పశువులకు టీకాలు

ప్రజాశక్తి -కోటవురట్ల:లంపి స్కిన్ వ్యాధి రాకుండా పశువులకు టీకాలు వేయించుకోవాలని లైవ్ స్టాక్ అసిస్టెంట్ శ్రీనివాస్ సూచించారు. ఈ వ్యాధి సోకితే రైతులకు తీవ్రమైన ఆర్థికనష్టం కలుగుతుందని తెలిపారు. పలు గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఈ వ్యాధి ఆవులు, గేదెలకు సోకుతుందని ఈగలు, జోరీగల కారణంగా ఇతర పశువులకు సంక్రమిస్తుందని తెలిపారు. తీవ్రమైన జ్వరంతో పశువు కళ్ళ నుంచి నీరు ముక్కు నుంచి సొంగ వంటి లక్షణాలు ఉంటాయన్నారు.


ఫాగింగ్ చేపడుతున్న సిబ్బంది

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. సీహెచ్.నాగాపురం గ్రామంలో సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు ఆధ్వర్యంలో శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ ఇంటి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సూచించారు. పాతకృష్ణదేవిపేట, కృష్ణదేవిపేట తదితర పంచాయతీల్లో చేపట్టారు.

డెంగీ, డయేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని గొడిచెర్ల పి హెచ్సి వైద్యాధికారి సుకన్య, సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం పలు గ్రామాల్లో డెంగీ, డయేరియా నివారణ చర్యల పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ, డయేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలను అప్రమత్తం చేసారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి సూచించారు.. డయేరియా బారిన పడకుండా పరిశుభ్రమైన వేడి ఆహారం తీసుకోవాలని, వేడి చేసిన నీటిని చల్లార్చి తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపమాక పంచాయతీ సర్పంచ్ ప్రగడ వీరబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది లక్ష్మణరావు, యువిఎస్ రావు, శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు .


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


తుప్పలు తొలగింపు చేయిస్తున్న సర్పంచ్

శ్మశాన వాటికలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో శ్మశాన వాటిక వద్ద తుప్పల తొలగింపును శుక్రవారం చేపట్టారు. నేల చదును పనులు ప్రారంభించారు. బురదగా ఉండటంతో పనులకు ఆటంకం కలిగింది. నేల ఆరిన తరువాత తిరిగి పనులు ప్రారంభిస్తామని సర్పంచ్ తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి

పశుగ్రాసంపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంటలో శుక్రవారం పశు గ్రాసం ప్రాధాన్యతపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి నూకేశ్ మాట్లాడుతూ, పాల దిగుబడి పెరుగుదలకు ఆరోగ్యవంతమైన పిల్లల ఉత్పత్తి, వ్యాధినిరోధక శక్తి పెరుగుదల వంటివి పచ్చి మేత పశుగ్రాసంలో లభిస్తాయన్నారు. విత్తనాలు రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు.

పంటల్లో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- కోటవురట్ల మండల వ్యాప్తంగా ఇటీవల అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ పంటల విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిని సరోజినీ తెలిపారు. పలు ప్రాంతాల్లో నారుమడులకు పొడ తెగులు ప్రబలడంతో మండల వ్యవసాయ అధికారిని నివారణ చర్యలపై శుక్రవారం బికేపల్లి, లింగాపురం గ్రామాలను సందర్శించి రైతులకు సలహాలు అందజేశారు. అప్రమత్తంగా ఉండి పొడ తెగులు సోకిన వరి నారు మడులకు ఎక్సకోనజోల్ 2 ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. మండల వ్యాప్తంగా 1575 హెక్టార్లలో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమైనట్లు చెప్పారు.


అవగాహన కల్పిస్తున్న ఎఒ

సాంకేతిక విద్యపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాంకేతిక నైపుణ్య దినోత్సవం సందర్భంగా సాంకేతిక విద్యా బోధనపై ఎంఈఓ కే నరేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేంపాడు హైస్కూల్లో విద్యార్థులకు స్మార్ట్ టీవీ, ట్యాబ్ల ద్వారా అందిస్తున్న సాంకేతిక విద్యపై ఉపాధ్యాయులు వివరించారు.సాంకేతిక పరికరాలను ఉపయోగించి విద్యా బోధన చేశారు.విద్యార్థులతోనూ చెప్పించారు.ఈ కార్యక్రమంలో పలువు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట పెంట పాటి సూర్యారావు మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ వనరుల వినియోగంపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తయారీ చేసిన డిజిటల్ సామగ్రిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కుసుమంచి నాగేశ్వరావు మాట్లాడుతూ, యువత డిజిటల్ రంగంలో ముందడుగులో ఉండాలన్నారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజారావు, వాసవి లత, మీనాక్షి, విజయకుమారి పాల్గొన్నారు.


నక్కపల్లి మండలం వేంపాడులో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు